ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 31.0
కనిష్ఠం 24.0
**

ANDHRAJYOTHY



సూర్యాపేట

5

సోమవారం 29 జూలై 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	510.30 (132.0098)	61,111	6,282
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.20 (3.82)	831.70	471.60
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	103.24 (1.06)	212	నిల్

చికెన్ ధరలు | లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.180 | స్కిన్‌లెస్ : రూ.210



సహకార సంఘాల్లో సీఈవోల పెత్తనం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రాథమిక సహకార సంఘాల్లో ఆధిపత్య పోరు సాగుతోంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 107 పీఏసీఎస్‌లు ఉన్నాయి. చాలా సొసైటీల్లో 30 నుంచి 40 ఏళ్లుగా సీఈవోలు తిష్ట వేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ చైర్మన్లను సైతం లెక్క చేయడం లేదు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు 107 ఏళ్ల చరిత్ర ఉంది. చాలా మంది సొసైటీ చైర్మన్లు రైతుల అభిమానంతో పలుమార్లు ఎన్నికై బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయితే పలు చోట్ల సీఈవోలే పెత్తనం సాగిస్తూ ముప్పు తిప్పలు పెడుతున్నారని పలువురు చైర్మన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- నల్లగొండ



- దశాబ్దాలుగా తిష్ట వేసి ఇష్టారాజ్యం
- డమ్మీలుగా మారామని చైర్మన్ల ఆవేదన
- బదిలీలపై దృష్టి సారించని టెస్కాబ్
- ఎన్నడూ జరగని డీఎల్ఈసీ భేటీలు

రైతుల కోసం పీఏసీఎస్‌ల చైర్మన్‌లు పనిచేయాల్సి ఉండగా, ఏళ్లుగా తిష్ట వేసిన సీఈవోలు లెక్కపెట్టకపోవడంతో వారికి ఎటూ పాలుపోవడం లేదు. ప్రతీ సొసైటీ చైర్మన్ పదవీకాలం ఐదేళ్లు. సీఈవోలు మాత్రం వారు ఉద్యోగ విరమణ చెందేంత వరకు తమను ఎవ్వరూ ఏమీ చేయలేరనే అభిప్రాయంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. దీంతో చాలా సొసైటీల్లో చైర్మన్లకు, సీఈవోలకు పొసగక సమస్య జటిలంగా మారి సొసైటీల ప్రతిష్ఠ దెబ్బతింటోంది. నాలుగేళ్ల గా డీసీసీబీ రూ.2,200కోట్ల టర్నోవర్‌తో ముందుకు సాగుతుండగా, పీఏసీఎస్‌ల లో మాత్రం కోల్డ్‌వార్‌తో తిరోగమన దిశగా పయనిస్తున్నాయన్న చర్చ సాగుతోంది.



టెస్కాబ్ నిర్ణయంతోనే బదిలీలు

దీర్ఘకాలికంగా సొసైటీల్లో పనిచేస్తున్న సీఈవోల బదిలీతో పాటు అన్ని సొసైటీల్లో బదిలీలపై టెస్కాబ్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. టెస్కాబ్ నుంచి బదిలీల ఉత్తర్వులు వస్తే ఆ ప్రక్రియను నిర్వహిస్తాం. కొన్ని సొసైటీల్లో దీర్ఘకాలికంగా సీఈవోలు ఒకే ప్రాంతంలో పని చేస్తుండటంతో సమస్యలు ఏర్పడిన పరిస్థితులు దృష్టికి వచ్చాయి. బదిలీల ప్రక్రియ మా పరిధిలో లేదు. రాష్ట్ర స్థాయి నుంచి ఆదేశాలు వస్తేనే బదిలీలు ఉంటాయి.

- ఆర్.కిరణ్‌కుమార్, నల్లగొండ డీసీవో

డీఎల్ఈఎస్ భేటీలు కరువు

పీఏసీఎస్ చైర్మన్లు, సీఈవోలకు మధ్య వివాదాలు చోటుచేసుకుంటున్నా డిస్ట్రిక్ లెవల్ ఎంపార్డ్ కమిటీ(డీఎల్ఈఎస్) ఎన్నడూ భేటీ కాలేదు. ఈ కమిటీలో డీసీసీబీ చైర్మన్‌తో పాటు సీఈవో, డీసీవో, నాబార్డు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధికారులు ఉంటారు. సొసైటీల్లో చైర్మన్లు, సీఈవోల మధ్య ఇబ్బందులు తలెత్తినప్పుడు సమన్వయపర్చడం, అవసరమైతే సీఈవోను ఇతర సొసైటీలకు బదిలీ చేసేందుకు టెస్కాబ్‌కు సిఫారసు చేయడం ఈ కమిటీ విధి. అదేవిధంగా చైర్మన్, సీఈవో మధ్య స్నేహపూర్వక వాతావరణం కల్పించి సొసైటీ ద్వారా రైతులకు మేలు చేకూర్చేలా ఈ కమిటీ వ్యవహరించాలి. అయితే చాలా సొసైటీల్లో సీఈవోలు చైర్మన్ల మాట వినకపోవడంతో పాటు పాలకవర్గాల తీర్మానాలను బుట్టదాఖలు చేస్తున్నారు. చైర్మన్లు చెప్పినా రైతులకు రుణాలు ఇచ్చే విషయాన్ని పట్టించుకోకుండా వారిని సొసైటీల చుట్టూ తిప్పించుకొని ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సీఈవోల బదిలీల విషయంలో టెస్కాబ్ నిర్ణయం తీసుకోకపోవడంతో ఉమ్మడి జిల్లాలోని చాలా పీఏసీఎస్‌లలో సమస్యలు జటిలంగా మారుతున్నాయి. ఇప్పటికైనా డీఎల్ఈఎస్ భేటీ నిర్వహించి సొసైటీల్లో పరిస్థితులను అంచనా వేయడంతో పాటు దీర్ఘకాలికంగా తిష్టవేసిన సీఈవోలకు స్థానచలనం కల్పించాలని చైర్మన్లు కోరుతున్నారు.

బదిలీలపై దృష్టి సారించని టెస్కాబ్

వాస్తవానికి పీఏసీఎస్‌ల సీఈవోల బదిలీని టెస్కాబ్ పర్యవేక్షించాలి. హైదరాబాద్‌లోని టెస్కాబ్ అధికారులు ఉమ్మడి జిల్లాలోని డీసీసీబీ, సొసైటీల్లో బదిలీల ప్రక్రియను చూడాల్సి ఉంటుంది. జిల్లా సహకార కేంద్ర బ్యాంకుతో పాటు బ్రాంచ్‌లలో కిందిస్థాయి ఉద్యోగుల నుంచి పైస్థాయి అధికారుల వరకు బదిలీలు చేస్తున్నా, సొసైటీల్లో మాత్రం సీఈవోల బదిలీలపై దృష్టి సారించడం లేదు. దీంతో ఒకే సొసైటీల్లో సీఈవోలు దశాబ్దాలుగా కొనసాగుతుండటంతో చైర్మన్ల నిర్ణయాలను వారు ఖాతరు చేయడం లేదు. కొద్ది రోజుల క్రితం కొన్ని సొసైటీలల పాలకవర్గాలు సీఈవోలను తొలగించాలని తీర్మానాలు చేసి డీసీఈవోతో పాటు డీసీసీబీ సీఈవోకు, టెస్కాబ్‌కు సైతం తీర్మానాలను పంపినా, వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. తాము పదవుల్లో ఉన్నా, తమ మాటను ఖాతరు చేయని ఉద్యోగి రైతులకు ఏం న్యాయం చేస్తారని చైర్మన్లు, డైరెక్టర్లు వాపోతున్నారు. ఇటీవల నల్లగొండలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఉమ్మడి జిల్లా మహాజన సభ జరిగిన సమయంలో మూడు జిల్లాల నుంచి పీఏసీఎస్ చైర్మన్లు హాజరయ్యారు. చాలా మంది చైర్మన్లు సీఈవోల వ్యవహార శైలిని ఈ మహాజన సభ దృష్టికి తీసుకెళ్లారు. సీఈవోలతో సొసైటీలు దెబ్బతింటున్నాయని వారు వాపోయారు. అయితే సీఈవోల బదిలీల ప్రక్రియ డీసీసీబీ చేతుల్లో లేదని టెస్కాబ్ దృష్టికి తీసుకెళ్తామని నాడు సర్దిచెప్పారు. సీఈవోల బదిలీపై టెస్కాబ్ వెంటనే నిర్ణయం తీసుకోవాలని చైర్మన్లు కోరుతున్నారు.



వర్షాలతో పెరిగిన సాగు విస్తీర్ణం

భారీ వర్షాలు లేక పుంజుకోని వరి సేద్యం

నల్లగొండ, జూలై 28: జిల్లాలో నాలుగైదు రోజులుగా కురిసిన ముసురుతో కూడిన వర్షాలకు పంటల సాగు విస్తీర్ణం పుంజుకుంది. వానాకాలం ప్రారంభంలో వర్షాలు లేకపోవడంతో పంటల సాగు విస్తీర్ణంపై ప్రభావం చూపింది. నల్లగొండ జిల్లాలో జూన్ 1 నుంచి ఇప్పటి వరకు 199.1 మి.మీల వర్షంపాతానికి 254.8మి.మీల వర్షం కురిసింది. 28మి.మీల వర్షపాతం అధికంగా నమోదైంది. ముసురుతో కూడిన వర్షాలతో మెట్ట పంటలకు ప్రధానంగా పత్తి పంటకు జీవం వచ్చింది. అయితే భారీ వర్షాలు లేకపోవడంతో వరి సాగుపై ప్రభావం పడింది. భారీ వర్షాలు లేక దుక్కులు తడవక ఇప్పటి వరకు కేవలం 41,058ఎకరాల్లో మాత్రమే వరి సాగైంది. నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు వరద వస్తే ఎడమకాల్వకు నీటి విడుదల చేస్తే ఆయకట్టులో పెద్ద మొత్తంలో వరి సేద్యం కానుంది. పత్తి జిల్లాలో 5.40లక్షల ఎకరాలకు ఇప్పటి వరకు 4,48,290 ఎకరాల్లో రైతులు పత్తి విత్తనాలు విత్తారు. వర్షాలు కురవక ముందు 3,46,790 ఎకరాల్లో రైతులు పత్తి విత్తనాలు విత్తారు.

ముమ్మరంగా వరి నాట్లు

పాలకవీడు: వరుస వర్షాలకు సాగ ర్ జలాశయానికి వరద వస్తుండటంతో మండలంలో రైతు లు జోరుగా వరి నాట్లు వేస్తున్నారు. వర్షాలకు దుక్కులు పదునెక్కడంతో ప్రస్తుతం వరి నాట్లలో రైతులు బిజీగా ఉన్నారు. మహిళా కూలీలు పెద్ద సంఖ్యలో నాట్లతో ఉపాధి పొందుతున్నారు.

మూసీకి నిలకడగా కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

కేతేపల్లి: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోంది. హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాలతో పాటు మూసీ ఎగువ పరివాహక ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు గత వారం రోజులుగా మూసీలోకి వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరుగుతూ వస్తుంది. 645అడుగుల (4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు నీటి మట్టం ఆదివారం సాయంత్రానికి 643.20 అడుగులు (3.82టీఎంసీ)లుగా నమోదైంది. ఎగువ నుంచి ప్రాజెక్టులోకి 831.70 క్యూసెక్కుల వరద వస్తుండగా, మూసీ ఆయకట్టులో పంటల సాగుకు ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు 471క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నాట్లు వేస్తున్నాం

ఇటీవల కురిసిన వర్షాలకు సాగర్ జలాశయం నిండుతున్నందున ఆశతో నాట్లు వేస్తున్నాం. మొదటి విడతగా ఆగస్టు మొదటి వారంలో సాగర్ నుంచి ఆయకట్టుకు నీటిని విడుదలచేయాలి.

- కమలాకర్‌రెడ్డి, రైతు,పాలకవీడు

సాగర్‌కు 61,111 క్యూసెక్కుల వరద

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటి మట్టం ఆదివారం సాయంత్రానికి 510.30 అడుగులకు (132.0098 టీఎంసీలు) చేరుకుంది. సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు కుడి గట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 27,562 క్యూసెక్కులు, ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 33,549 క్యూసెక్కులు మొత్తం మొత్తం 61,111 క్యూసెక్కుల సాగర్‌కు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి కుడి కాలువ ద్వారా 5,882 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 6,282 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి 61,111 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. సాగర్ నుంచి ఎడమ, వరద కాలువలకు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి ఎటువంటి నీటి విడుదల లేదు.

రెండో విడత రుణమాఫీ రేపే

- రూ.1లక్ష నుంచి రూ.1.50లక్షల వరకు మాఫీ
- ఏర్పాట్లు చేస్తున్న అధికార యంత్రాంగం



నల్లగొండ, జూలై 28: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రెండో విడత రుణమాఫీకి సన్నాహాలు పూర్తయ్యాయి. ఈనెల 30వ తేదీన రూ.1లక్ష నుంచి రూ.1.50లక్షల వరకు రైతు బ్యాంకు రుణాలు ఈ దఫా మాఫీకానున్నాయి. అందుకు సంబంధించి ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మూడు కలెక్టరేట్లలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. హైదరాబాద్‌లోని అసెంబ్లీ ప్రాంగణంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం మధ్యాహ్నం 12గంటలకు రెండో విడత రుణమాఫీని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులతో పాటు ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. అదేరోజు మధ్యాహ్నం నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాలోని కలెక్టరేట్లలో రుణమాఫీ ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్లతో పాటు ఆయా జిల్లాల వ్యవసాయశాఖ, సహకారశాఖ అధికారులు, అర్హులైన కొంతమంది రైతులు పాల్గొంటారు. వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి సందేశాన్ని విన్న అనంతరం ఉమ్మడి జిల్లాలోని మూడు జిల్లాలకు చెందిన కలెక్టర్లు రెండో విడత రుణమాఫీ సంబరాలను రైతుల సమక్షంలో ఘనంగా నిర్వహిస్తారు. ఈనెల 18వ తేదీన మొదటి విడత రుణమాఫీ సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించగా అందులో మంత్రులతో పాటు రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అదేవిధంగా రైతు వేదికల్లో కూడా సంబరాలు నిర్వహించారు. తొలి విడతలో నల్లగొండ జిల్లాలో 83,124మంది రైతులకు చెందిన రూ.454కోట్ల రుణాలు మాఫీ అయ్యాయి. సూర్యాపేట జిల్లాలో 56,274మంది రైతులకు చెందిన రూ.282కోట్లకు పైగా రుణాలు మాఫీ అయ్యాయి. ప్రస్తుతం 70వేల మంది రైతుల రుణాలు మాఫీ కానున్నాయి.

విద్యారంగాన్ని సంక్షోభం నుంచి కాపాడాలి

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.రాములు



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.రాములు

కోదాడటౌన్, జూలై 28: ప్రభుత్వ విద్యారంగాన్ని సంక్షోభం నుంచి కాపాడాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సీహెచ్ రాములు అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలో టీఎస్ యూటీఎఫ్ కోదాడ డివిజన్ ఆధ్వర్యంలో తొగర్రాయి హైస్కూల్‌లో సుధాకర్‌రావు ఉద్యోగ విరమణ అభినందన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలలో అరకొరగా విద్యార్థులుంటే అంగన్‌వాడీలో ఒకటో తరగతి నుంచి మూడో తరగతి వరకు విద్యార్థులను కొనసాగించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం తీసుకోబోయే నిర్ణయాన్ని టీఎస్ యూటీఎఫ్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఇంగ్లీష్ మీడియంలో ఉపాధ్యాయులను నియామకం చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే చెల్లించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులు లేక పారిశుధ్యం మరుగున పడిందని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తరగతి గదులను ఊడ్చుకునే దుస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎన్.సోమయ్య, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, జిల్లా ఉపాధ్యాక్షుడు పి. శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కార్యదర్శులు నాగేశ్వరరావు, శ్రీదేవి, వివిధ సంఘాల నేతలు జనార్థన్, ప్రసాదరావు పాల్గొన్నారు.

గృహజ్యోతి సబ్సిడీ రూ.5.22 కోట్లు

ఎస్ఈ పాల్‌రాజ్



సూర్యాపేటలో విలేకరులతో మాట్లాడుతున్న ఎస్ఈ పాల్‌రాజ్

భానుపురి, జూలై 28: జిల్లాకు ప్రతీ నెల గృహజ్యోతి సబ్సిడీ రూ.5.22కోట్లు వస్తోందని, అర్హులైన ప్రతీ ఒక్కరు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ పాల్‌రాజ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ ఎస్ఈ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 1,67,467 మంది గృహజ్యోతి పథకానికి అర్హులుగా ఉన్నారని పేర్కొన్నారు. 200 యూనిట్ల కంటే తక్కువ విద్యుత్ వినియోగించే 1,56,097 సర్వీసులు ఉన్నాయని, 200 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగించే కనెక్షన్లు 7,970 వరకు ఉన్నాయన్నారు. ప్రభుత్వం నుంచి ప్రతీ నెల జిల్లాకు రూ.5.22కోట్ల సబ్సిడీ వస్తోందన్నారు. ప్రభుత్వాన్ని, విద్యుత్‌శాఖను బదనాం చేసేందుకు కొంతమంది బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. విద్యుత్ వినియోగం 200 యూనిట్ల కంటే ఎక్కువ ఉంటే గృహజ్యోతి వర్తించదన్నారు. 200 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగం కాకుండా ఉండాలంటే మూడు ఫ్యాన్లు, నాలుగు ట్యూబ్ లైట్లు, టీవీ, ఆఫ్ హెచ్‌పీ మోటారును మాత్రమే వినియోగించాలన్నారు. విద్యుత్ లైట్లు అవసరం లేకున్నా వేయడం వల్ల 200 యూనిట్లు దాటుతోందన్నారు. సమావేశంలో విద్యుత్‌శాఖ డీఈ శ్రీనివాస్, ఏడీఈ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఏఈ యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి నాగన్న



సమావేశంలో మాట్లాడుతున్న యరగాని నాగన్నగౌడ్

హుజూర్‌నగర్, జూలై 28: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తోందని, దీన్ని సహించేది లేదని ఐఎన్‌టీయూసీ జాతీయ ప్రధానకార్యదర్శి యరగాని నాగన్నగౌడ్ అన్నారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన ఎస్‌డబ్ల్యూసీ హమాలీ కార్మిక యూనియన్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా తీసుకురావడం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న మోదీ, కార్మికులను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. నూతన కార్మిక చట్టాలతో కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. హమాలీ కార్మికులకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వరంగ సంస్థలో పనిచేస్తున్న కార్మికులను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో చింతకాయల రాము, కందుల వెంకన్న, గుంజ వెంకన్న, గురవయ్య, శ్రీనివాస్, రాము, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహుడికి వైభవంగా కల్యాణోత్సవం



కల్యాణ తంతు నిర్వహిస్తున్న వేదపండితులు

మఠంపల్లి, జూలై 28: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మట్టపల్లి లక్ష్మీనృసింహుడి క్షేత్రంలో ఆదివారం రాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత స్వామివారి నిత్యకల్యాణాన్ని వేదపండితులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం, నిత్యార్చనలు చేశారు. అనంతరం ఆలయ సంప్రదాయ ప్రకారం ఆర్జిత కైంకర్యాలు నిర్వహించారు. ఉదయం హోమాధికాలు భక్తిశ్రద్ధలతో చేశారు. అందంగా అలంకరించిన కల్యాణమూర్తులను పరిణయోత్సవ వేదికపై అధిష్ఠింపజేసి పుణ్యహావాచనం చేశారు. పాదప్రక్షాళన, మధుపర్క పూజల అనంతరం మాంగళ్యధారణ, యజ్ఞోపవీత ధారణ, దివ్యమూర్తులకు గరుడోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారికి కుంకుమార్చన, విశేషపర్వాలు కొనసాగాయి. కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



•6లో..

యాదగిరికొండపై భక్తుల సందడి

శాకంబరి అలంకరణలో తిరుపతమ్మ



శాకంబరి అలంకరణలో అమ్మవారు

మఠంపల్లి, జూలై 28: మండల కేంద్రంలోని గోపయ్య స్వామి సమేత తిరుపతమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారు శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని అమ్మవారికి 15 రకాల కూరగాయలతో ఆలయ పూజరి కంటు వీరయ్య అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు కంటు వీరయ్య, రామనర్సమ్మ, మహాశిల సహకారంతో అన్నదానం చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

లోపాలు లేకుండా పూజలు నిర్వహించాలి



పండితుడిని సన్మానిస్తున్న ధర్మజాగరణ సమితిసభ్యులు

నేరేడుచర్ల, జూలై 28: స్వామి, అమ్మవారికి నిర్వహించే నిత్యపూజలు లోపాలు లేకుండా చేయాలని వేదపండితుడు నందుల లక్ష్మీనర్సింహశాస్త్రి అన్నారు. పూజా విధానంపై నేరేడుచర్ల ధర్మజాగరణ సమితి ఆధ్వర్యంలో స్థానిక శివాలయంలో ఐదు రోజులుగా కొనసాగిన శిక్షణ ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించగా, ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతీ రోజు చేసుకునే పూజల్లో లోపాలు లేకుండా ఉండాలని ఆయన పలు సూచనలు చేశారు. అనంతరం శిక్షణ ఇచ్చిన వేద పండితులను సన్మానించారు. కార్యక్రమాన్ని బంటు శ్రీనివాసు, ఓరువాల అనిత, కీత సరోజినమ్మ ఏర్పాటుచేయగా, ధర్మజాగరణ సమితి సభ్యులు, వాసవి, వనితాక్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

దేవరకొండ, జూలై 28: నల్లగొండ జిల్లా నేరుడుగొమ్ము మండలంలో ఆదివారం దేవరకొండ ఎక్సైజ్‌శాఖ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఆటోలో తరలిస్తున్న 15 బస్తాల నల్ల బెల్లం, పటిక 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం పరుచుకున్నట్లు సీఐ తెలిపారు. బెల్లం, నాటుసారా, తరలిస్తున్న శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.




జైపాల్‌రెడ్డి ఘాట్‌వద్ద నివాళి అర్పిస్తున్న సుఖేందర్‌రెడ్డి, చిత్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు

జైపాల్‌రెడ్డికి ఘన నివాళి

నల్లగొండ, జూలై 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దివంగత నేత కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి 5వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని స్ఫూర్తిస్థల్‌లో జైపాల్‌రెడ్డి ఘాట్ వద్ద శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గుత్తా వెంకట్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పాశం రాంరెడ్డి పాల్గొని నివాళులర్పించారు .

స్నేహమంటే ఇదేరా..!


● స్నేహితురాలికి రక్త చిత్రంతో జన్మదిన శుభాకాంక్షలు ● నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలో ఘటన

నార్కట్‌పల్లి, జూలై 28: వాళ్లిద్దరూ మంచి స్నేహితులు... ప్రాంతాలు వేరైనా స్నేహం వారిని ఒక్కటి చేసింది.... ఇద్దరూ ఒకే కాలేజీలో మెడిసిన్ చదువుతున్నారు. వీరిలో ఓ స్నేహితురాలి పుట్టినరోజు సందర్భంగా వినూత్నంగా శుభాకాంక్షలు తెలిపి స్నేహబంధాన్ని ఆమెపై ఉన్న అమితమైన స్నేహాన్ని చాటుకుంది మరో స్నేహితురాలు. వివరాల్లోకి వెళితే నిజామాబాద్ జిల్లాకు చెందిన గాదపాక శ్రియ, నార్కట్‌పల్లి మండలం మాండ్ర గ్రామానికి చెందిన గుండు అంజలి నార్కట్‌పల్లి కామినేని వైద్య విద్య కళాశాలలో ఎంబీబీఎస్ రెండో సంవత్సరం చదువుతున్నారు. ఇద్దరూ మంచి స్నేహితులు. ఈ నెల 28వ తేదీన అంజలి పుట్టిన రోజు సందర్భంగా స్నేహితురాలికి ఎప్పటికీ గుర్తుండిపోయే బహుమతిని వినూత్నంగా ఇవ్వాలని శ్రియ అనుకుంది. దీంతో నల్లగొండలోని ఓ గిఫ్ట్ షాపును ఆశ్రయించింది. ఇందుకోసం 14ఎంఎల్ రక్తం ఇచ్చిన అంజలి తాను శ్రియ కలిసి ఉన్న ఫొటో మాదిరి తన రక్తంతో గీయించింది. ఆ చిత్రాన్ని ఇంటికి వచ్చి పుట్టినరోజు కానుకగా అందించి ఆశ్చర్యపరిచింది. స్నేహబంధాన్ని రక్తబంధంగా మార్చి శ్రియ చూపిన అభిమానాన్ని అంజలితో పాటు ఆమె కుటుంబసభ్యులు పొంగిపోయారు.


తన రక్తంతో గీయించిన చిత్రపటాన్ని అంజలికి అందజేస్తున్న శ్రియ(ఫొటోలో ఎడమవైపు)

హామీలను వెంటనే అమలు చేయాలి : వంగూరి

నల్లగొండ రూరల్, జూలై 28: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఆశాల వర్కర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా స్థాయి శిక్షణా తరగతులను స్థానిక దొడ్డికొమరయ్య భవనంలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనం రూ. 18వేలకు బడ్జెట్ నిర్ణయించి అమలు చేయాలన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు ఆశాలకు రూ.50లక్షలు ఇన్సూరెన్స్ ఇవ్వాలన్నారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 30 జరిగే చలో హైదరాబాద్‌ను ఆశా కార్యకర్తలు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.మహేశ్వరి, టి.వెంకటమ్మ, పెంజర్ల సైదులు తదితరులు పాల్గొన్నారు.





యాదగిరికొండపై భక్తుల సందడి


ప్రాకార మండపంలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, జూలై 28: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి దర్శనార్థం వచ్చిన భక్తులతో యాదగిరికొండపై సందడి నెలకొంది. వారాంతపు సెలవు దినం కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వాహనాలపై తరలివచ్చారు. సుమారు 15వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా ప్రత్యేక, ధర్మదర్శన క్యూలైన్లు భక్తుల రద్దీ కొనసాగింది. ప్రత్యేక దర్శనాలకు అరగంట ధర్మదర్శనాలకు గంట సమయం పట్టింది. ప్రధానాలయం, కల్యాణోత్సవం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్రయశాల వద్ద భక్తులు కూడా భక్తులతో కోలాహలంగా మారింది. అదేవిధంగా భక్తులను కొండపైకి తరలించేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేశారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.23,53,996 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.


శాస్త్రోక్తంగా నిత్య పూజలు

సుప్రభాత సేవతో స్వామి అమ్మవార్లను మేల్కొలిపిన అర్చకులు స్వయంభువులకు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణపర్వాలు వైభవంగా చేపట్టారు. అదేవిధంగా పాతగుట్ట స్వామి అమ్మవారలకు నిత్య పూజలు ఘనంగా చేపట్టారు. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు, శైవాగమ రీతిలో జరిపారు. రాత్రి మహానివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వారబంధనం చేశారు. కాగా, ప్రతీ ఆదివారం నిర్వహించే సంగీత కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం జిల్లాకు చెందిన నయమిశారణ్య పీఠాధిపతి శ్రీ బాలబ్రహ్మానంద సరస్వతి ప్రవచనాలు చేశారు.

ఆటో బోల్తా .. ఐదుగురికి గాయాలు

నిడమనూరు, జూలై 28: కూలీలతో వెళ్తున్న ఆటో ప్రమాదవశాత్తు బోల్తా పడటంతో ఐదుగురు మహిళా కూలీలు గాయపడ్డారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం బొక్కమంతల పహాడ్ సమీపంలోని ఆముదాల మిల్లు వద్ద ఆదివారం రాత్రి జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం నూరేపల్లి గ్రామానికి చెందిన 17 మంది మహిళా కూలీలు త్రిపురారం మండలం కామారెడ్డిగూడెంలో వరినాటు వేసేందుకు ఆదివారం ఉదయం ఆటోలో వెళ్లారు. తిరిగి సాయంత్రం అదే ఆటోలో గ్రామానికి వెళ్తుండగా బొక్కమంతలపహాడ్ సమీపంలోని ఆముదాల మిల్లు వద్దకు రాగానే రోడ్డుపై ఉన్న గేదెను ప్రమాదవశాత్తు ఢీకొనడంతో ఆటో పల్టీ కొట్టడంతో పాటు రోడ్డు పక్కన ఉన్న పంట కాల్వలో పడిపోయింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న మన్నెపల్లి వీరమ్మ, భవాని, మల్లమ్మ, వెంకటమ్మ, పావని అనే ఐదుగురు మహిళా కూలీలు గాయపడ్డారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్ఐ గోపాల్‌రావు హుటాహుటిన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదంలో గాయపడిన కూలీలను 108 అంబులెన్స్ వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స అందిస్తున్నారు. కాగా పంట కాల్వలో పడిపోయిన ఆటోను ఎక్స్‌కవేటర్ సాయంతో బయటకు తీశారు. చీకట్లో రోడ్డుపై ఉన్న గేదె కనిపించకపోవడంతోనే ప్రమాదం జరిగినట్లు ఆటోలో ఉన్న మహిళలు తెలిపారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ గోపాల్‌రావు తెలిపారు.














అధిక వర్షాలతో పంటలకు

తెగుళ్లు-సస్యరక్షణ

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆరు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పంటలలో వివిధరకాల సమస్యలు తలెత్తే అవకాశంఉంది. ఈ సమయంలో పంటల సంరక్షణ చాలా ముఖ్యం. పంటల్లో రైతులు చేపట్టాల్సిన యజమాన్య పద్ధతులను నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) కంపసాగర్ శాస్త్రవేత్త చంద్రశేఖర్ వివరించారు.

- మిర్యాలగూడ(వ్యవసాయం)

పొలాల నుంచి మురుగు నీరు నిల్వలేకుండా తీసివేయాలి

మూడు రోజుల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పొలాల్లో మందుల పిచికారీ వాయిదావేయాలి.

వరి సాగులో



● నీరు సమృద్ధిగా ఉన్న ప్రాంతాల్లో రైతులు స్వల్పకాలిక(120-125 రోజులు) వరి రకాల నారుమళ్లు ఈ నెల 31వ తేదీ వరకు పోసుకోవచ్చు.

● దీర్ఘకాలిక వరి రకాల నారు బాగా ముదిరి(50రోజుల వయస్సు) ఆలస్యంగా నాటితే ఆకుల చివర తుంచి కుదురుల సంఖ్యను పెంచాలి. కుదురుకు 6-8 మొక్కల చొప్పున నాటుకోవాలి.

● నత్రజని ఎరువులను సిఫారసు కంటే 25శాతం పెంచి మూడు దఫాలుగా 70శాతం నాటేసమయంలో మిగతా 30శాతం అంకుర దశలో వేయాలి.

● వరి నాట్లు వేసుకునే వారం రోజుల ముందు ఎకరాకు సరిపోయే నారు మడికి 800గ్రాముల కార్బోఫ్యూరాన్ 3సీజీ గుళికలను ఇసుకలో కలిపి చల్లితే ప్రధాన పొలంలో పంటను 15-20 రోజుల వరకు కొన్నిరకాల పురుగుల నుంచి కాపాడుకోవచ్చు.

● ఇప్పటివరకు నారు పోయని రైతాంగం వర్షాలను సద్వినియోగం చేసుకుని పొలాలను దమ్ము చేసి పొలంలో నేరుగా విత్తే పద్ధతిని ఎంచుకోవడం వల్ల సమయంతో పాటు పెట్టుబడి ఆదా చేసుకోవచ్చు.

● నాట్లు పెట్టిన తరువాత ప్రతీ 2 మీటర్లకు కాలి బాటను తీయడం వల్ల గాలీవెలుతురు బాగా ప్రసరించి సుడి దోమ ఉధృతిని నివారించవచ్చు.

● ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా ఎకరానికి 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3సీజీ గుళికలను నాటిన 10 నుంచి15 రోజుల మధ్య వేసుకోవడం ద్వారా కాండం తొలుచు పురుగు, ఉల్లికోడును నివారించవచ్చు.

పత్తి సాగులో



● వర్షాలు తగ్గిన తరువాత ఎకరాకు 25 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రసాయన ఎరువులను పైపాటుగా 20-40 రోజుల వయస్సు పంటకు మొక్క మొదళ్లలో 7-10 సెంటీమీటర్ల దూరంలో పాదులు తీసి ఎరువును వేసి మట్టి వేయాలి.

● ముంపునకు గురైన పంట త్వరగా కోలుకోవడానికి 19:10:19 లేదా 13-0-45, లేదా యూరియా 10గ్రాముల లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

● నేల ద్వారా వ్యాప్తి చెందే తెగుళ్ల నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ లేదా కార్బెండిజమ్+మ్యాంకోజెబ్ శిలీంద్రనాశక మందును లీటర్ నీటికి కలిపి నేల బాగా తడిసేటట్లు వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

● పత్తి పంటలో వచ్చే గడ్డి జాతి, వెడల్పాకు కలుపు మొక్కల నివారణకు(2-3ఆకుల దశలో)క్విజలోఫాప్ ఇథైల్, పైరిథాయోబ్యాక్ సోడియం కలుపు మందులను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

కంది సాగులో : ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో కంది పంటకు ఎండు తెగులు ఆశించడానికి అనుకూలంగా ఉంటుంది. నివారణకు మెటలాక్సిల్ మందును లీటరు నీటికి కలిపి నేలను తడపాలి.

వేరుశనగ సాగులో: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వేరుశనగలో మొదలుకుళ్లు తెగులు ఆశించేందుకు అవకాశం ఉంటుంది. తెగులు నివారణకు మొదళ్ల దగ్గర కార్బండిజమ్, మ్యాంకోజెబ్ 2గ్రాము మందును లీటర్ నీటికి కలిపి నేలను తడపాలి.

కూరగాయలు

● టమాట, వంగ మిరప, బంతి పంటల నారుమళ్లలో నారు కుళ్లు తెగులు నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాముల మందును లీటర్ నీటికి కలిపి నేల పూర్తిగా తడిచేటట్లు పిచికారీ చేయాలి.

● కూరగాయల పంటల్లో ఆకు మచ్చ తెగులు సోకేందుకు ప్రస్తుత కాలం అనుకూలం. నివారణకు కార్బండిజమ్ ఒక గ్రాము, లేదా ప్రోపికోనజోల్ మందును లీటర్ నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.



నారుమడి.. కీలకం

విత్తన ఎంపికలో జాగ్రత్త సుమీ

వరి సాగులో ప్రధానంగా నారు మడి కాలం కీలకం. సాగు ప్రారంభించే కాలాన్ని బట్టి నారుమడిని ఎంపిక చేసుకోవాలి. అదేవిధంగా నీటివసతి, ప్రాంతాన్ని బట్టి చీడపీడలను తట్టుకునే వరి విత్తన రకాలను ఎంపిక చేసుకోవాలి. ఆయా విత్తనాల కాలపరిమితిని బట్టి నారుపోసుకోవాలి. జూన్‌లో అయితే దీర్ఘకాలిక(140 రోజులు) రకాలు, జూన్ తర్వాత మధ్య, స్వల్పకాలిక(110 నుంచి 135 రోజులు) రకాలు, జూలై 18 వరకు స్వల్పకాలిక రకాలు, జూలై నెల చివరివరకు నారు పోసుకోవచ్చు. ఎకరా సాగుకు సన్నరకం 20 కిలోలు వాడాలి. దొడ్డు రకానికి 25 కిలోలు వాడాలి.

- భువనగిరి రూరల్

విత్తనశుద్ధి తప్పనిసరి

నారుపోసే ముందు తడి విత్తన శుద్ధికి కార్బండిజమ్ ఒక గ్రాము, పొడి విత్తనశుద్ధికి 3 గ్రాముల మందును కిలో విత్తనానికి కలిసి విత్తుకోవాలి.

చల్లుకోవడంలో మెళకువలు

విత్తనం వత్తుగా చల్లుకుంటే నారు బలహీనంగా పెరుగుతుంది. విత్తనం పలచగా చల్లాలి. మొలకకట్టాక చల్లి వారంరోజులు ఆరు తడులు, మొక్క దశలో పలుచగా నీరు ఉంచాలి.

జింకు లోపాన్ని గమనించాలి

జింకు లోపనివారణకు లీటరు నీటికి 2 గ్రాముల జింకు సల్ఫేట్ కలిపిన ద్రావాన్ని పిచికారీ చేయాలి. మెట్ట నారుమడిలో ఇనుపధాతు లోపాన్ని గమనించి సరిచేయాలి. పంట ఎదుగుదలను మేరకు 2 గ్రాముల నుంచి 5 గ్రాముల అన్నబేధి 0.5 నుంచి ఒక గ్రాము నిమ్మ ఉప్పు లీటరు నీటితో పిచికారీ చేయాలి. నాట్లు ఆలస్యమయ్యే పరిస్థితుల్లో రెండో దఫా నత్రజని ఆలస్యంగా వేసి నారు ముదురకుండా చూడాలి.

కలుపు నివారణ

నారుమడిలో రెండురోజుల్లో ప్రిటిలాక్లోర్ 50శాతం ఈసీ 2 మిల్లీమీటర్లు ఒక లీటరు నీటిలో కలపాలి. ఎకరాకు 400 మిల్లీలీటర్లు చల్లుకోవాలి. 3నుంచి 5 రోజుల్లో పైరజోసల్ఫ్యూరాన్ ఇథైల్ 10 శాతం డబ్ల్యూపీ 80గ్రాములు ఎకరాకు వేసుకోవాలి. 10 నుంచి 20 రోజుల్లో బిస్పిరిబాక్ సోడియం 100మిల్లీ లీటర్లు ఎకరాకు పిచికారీ చేసుకోవాలి.అవసరం మేరకు నారుమడికి సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. నాటువేసిన పొలంలో 3 నుంచి 5 రోజుల్లో పైరజో సల్ఫ్యూరాన్ ఇథైల్ 80గ్రాములు ఎకరాకు, 15నుంచి 20 రోజుల్లో సెహల్ పాస్‌బ్యూటైల్ 10శాతం ఈసీ 400 మిల్లీలీటర్లు ఎకరాకు చల్లుకోవాలి.

ముందు జాగ్రత్తలు

నాట్లు వేయడానికి 15రోజులు ముందు పవర్‌పిల్లర్లు, ట్రాక్టర్లతో 15 సెంటీమీటర్ల లోతుగా దమ్ము చేసుకోవాలి.ఎరువులు 36-24-24ఎన్‌పీకేలు అనగా ఎకరాకు 80 కిలోల యూరియా మూడుదఫాలుగా, సింగ్ సూపర్ ఫాస్పెట్ 150కిలోలు, 40 కిలోల పొటాష్ రెండు దఫాలుగా నాట్లు వేశాక చల్లాలి.

వరిసాగులో విత్తనశుద్ధి తప్పనిసరి



వరిసాగులో విత్తనశుద్ధి తప్పనిసరి. నీటివసతి మేరకు చీడపీడలను తట్టుకునే విత్తన ఎంపికతో అధికదిగుబడి అవకాశం.నారుపలుచకగా చల్లితే చేనుగా ఏపుగా పెరుగుతుంది.

డాక్టర్ అనిల్‌కుమార్, ప్రధాన శాస్త్రవేత్త ఏరువాక కేంద్రం, యాదాద్రి భువనగిరి జిల్లా

జోరుగా ఇసుక అక్రమ రవాణా

● ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పునకు రూ.3500 నుంచిరూ.4200 ● యథేచ్ఛగా ఇసుక డంప్‌లు ● పట్టించుకోని అధికారులు


మూసీ నదిలో నుంచి ఇసుకను తోడుతున్న ట్రాక్టర్ (ఫైల్)

మిర్యాలగూడ రూరల్, జూలై 28: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలో అధికారులు హెచ్చరికలు జారీ చేసినా ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. మండల పరిధిలోని పాలేరు, మూసీ వాగుల పరివాహక గ్రామాలైన తడకమళ్ల, తక్కెళ్లపాడు, కాల్వపల్లి, ఆలగడప, రుద్రారం గ్రామాల నుంచి ఇసుక రవాణా అడ్డగోలుగా సాగిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అనుమతులతో కూడిన ఇసుక రవాణా కంటే అక్రమంగా తరలించే ఇసుకకు డిమాండ్ పెరిగిందని పలువురు పేర్కొంటున్నారు. ఆన్‌లైన్ ద్వారా ఆలస్యమవుతుందని అక్రమ దందా నిర్వాహకులను ఆశ్రయించేలా బిల్డర్లు, కాంట్రాక్టర్లు ఇంటి నిర్మాణ యజమానులకు ఉచిత సలహాలిస్తూ వారి పర్సంటేజీలు అందుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్మాణ పనులు మధ్యలో పనులు నిలిచిపోకుంటా ఉంటే అదనంగా డబ్బులు చెల్లించి మరీ ఇసుకను కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు దాపురించాయి.

అనుమతులు అంతంత మాత్రమే

మండల పరిధిలోని తక్కెళ్లపాడు, తడకమళ్ల ప్రాంతాల నుంచి ఆన్‌లైన్ ఇసుక అనుమతులను నిలిపివేశారు. దీంతో వేములపల్లి మండలంలోని కామేపల్లి, రావులపెంట నుంచి ఆన్‌లైన్ ద్వారా రూ.3500కు మిర్యాలగూడ ప్రాంతానికి ఇసుక రవాణా చేపడుతుండగా గృహ నిర్మాణ యజమానులు, బిల్డర్లు ఆన్‌లైన్ రవాణాపై నిరాసక్తత కనబరుస్తున్నట్లు తెలుస్తుంది. దీంతో అక్రమార్కులకు అవకాశం కలిసి వస్తుండటంతో కాల్వపల్లి, ఆలగడప, తక్కెళ్లపాడు, రుద్రారం గ్రామాలతో పాటు పట్టణంలోని ఈదులగూడెం ప్రాంతంలో ఇసుకను డంపింగ్ చేసుకొని వెంచర్లలో గృహ నిర్మాణాలకు పట్టపగలే జోరుగా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. కళ్లముందే ఈ తతంగం సాగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పుకు రూ.3500 నుంచి రూ.4200 వరకు ధరను నిర్ణయిస్తూ ఇసుక దందా సాగిస్తున్నారు. రాజకీయ పలుకుబడి కోసం ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ నాయకులతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఇసుక అక్రమ దందాపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమ రవాణా చేపడితే కఠిన చర్యలు

అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. మూసీ, పాలేరు వాగుల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వారిపై ఇప్పటికే చర్యలు చేపట్టామని, తిరిగి ఇసుక దందాను కొనసాగిస్తే సహించేది లేదు.

నరేష్, ఎస్‌ఐ, మిర్యాలగూడ రూరల్

బాస్కెట్‌బాల్ పోటీలో ప్రతిభ



బాస్కెట్‌బాల్ పోటీలో పాల్గొన్న సురేష్‌నాయక్

తిరుమలగిరి(సాగర్), జూలై 28: తమిళనాడులోని కోయంబత్తూర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి వీల్‌ఛైర్ బాస్కెట్‌బాల్ పోటీల్లో రంగుండ్ల తండాకు చెందిన ధరావత్ సురేష్‌నాయక్ ప్రతిభ కనబరిచాడు. ఈ నెల 25 నుంచి 27 వరకు ఈ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫైనల్ పోటీలో తెలంగాణ జట్టు, కర్ణాటక జట్టు తలపడగా హోరాహోరీగా జరిగిన ఈ పోటీలో తెలంగాణ జట్టు ద్వితీయ స్థానంలో గెలుపొందింది. అయితే ఈ పోటీలో ఫైనల్ చేరడంలో, ఈ టోర్నీలో పలు జట్లపై గెలుపొంది ఫైనల్‌కు చేరడంలో సురేష్‌నాయక్ ఎంతో ప్రతిభ కనబరిచాడు. ఇతను దివ్యాంగుల బాస్కెట్‌బాల్‌తోపాటు క్రికెట్ పోటీలో రాష్ట్ర జాతీయ స్థాయిలో రాణిస్తూ తెలంగాణ జట్టు పలు పోటీల్లో గెలుపొందేందుకు కీలకపాత్ర పోషిస్తున్నాడు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో సురేష్ రానిస్తుండడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

నా పర్సు ఇవ్వు.. ఇంటికి వెళ్లాలి

● మహిళ సంచిలో పర్సు చోరీ ● వెంటపడి పట్టుకున్న మహిళ

నేరేడుచర్ల, జూలై 28: సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్డు బస్టాప్ వద్ద మహిళ సంచిలో నుంచి పర్సును ఒక అగంతకుడు దొంగిలించాడు. ఆదివారం సాయంత్రం మహిళ బస్సు ఎక్కుతుండగా ఈ సంఘటన చోటు చేసుకుంది. ఎస్‌ఐ రవీంద్రనాయక్, బాధిత మహిళ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిలుకూరు మండలం బేతవోలు గ్రామానికి చెందిన చిమట భవాని పాలకవీడు మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలకు ఆదివారం వెళ్లింది. భవాని కుమార్తె 8వ తరగతి చదువుతూ హాస్టల్‌లో ఉండడంతో అక్కడికి వెళ్లింది. తిరిగి సాయంత్రం నేరేడుచర్లకు చేరుకుంది. నేరేడుచర్లలో పండ్లు తీసుకుని బస్సు ఎక్కుతుండగా వెనుక నుంచి వచ్చిన నల్లగొండకు చెందిన సంపంగి రవి పర్సు దొంగలించాడు. సంచి పట్టుకున్నట్లుగా అనిపించి వెనుకకు తిరిగి చూసే సరికి పర్సు తీసుకొని వెళుతున్న దొంగను గుర్తించి వెంటనే వెంబడించింది. అతను పారిపోతూ కనిపించకుండా ఉండేందుకు పక్కనే ఉన్న హోటల్‌కు వెళ్లాడు. అక్కడ అతన్ని గుర్తించి అన్నా నా పర్సు ఇవ్వు, అందులో ఆధార్‌కార్డు ఉంది. నేను ఇంటికి వెళ్లాలి అంటూ వేడుకుంది. కానీ దొంగ మాత్రం నేను దొంగను కాదంటూ వాదనకు దిగాడు. అక్కడే ఉన్న మరో వ్యక్తి అతని జేబులు గాలించినా పర్సు దొరకలేదు. దొంగ తెలివిగా టైట్ పాయింట్ వేసి ఉండడంతో పాయింట్లోకి వేశాడు. అది మోకాలు సమీపంలో చేరుకొని ఆగిపోయింది. బాధిత మహిళ గుర్తించడంతో అక్కడే ఉన్న వ్యక్తి అతని పాయింటు నుంచి పర్సు బయటకు తీశాడు. అతన్ని పట్టుకొని పరిసర ప్రాంతవాసులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అతన్ని పట్టుకొని స్టేషన్‌కు తీసుకు వచ్చి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తిప్పర్తి, జూలై 28: పాము కాటుకు గురై చికిత్స పొందుతున్న వ్యక్తి శనివారం మృతి చెందాడు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రగడ్డలగూడెం గ్రామానికి చెందిన ఏమిరెడ్డి వెంకట్‌రెడ్డి (50) వ్యవసాయ పనుల నిమిత్తం బావి వద్దకు వెళ్తుండగా ఈ నెల 22న పాము కాటుకు గురయ్యాడు. వెంటనే స్థానికులు ఆస్పత్రికి తరలించగా గత కొన్ని రోజులుగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. వెంకట్‌రెడ్డికి భార్య, కుమారుడు ఉన్నారు. ఈమేరకు మృతుడి కుమారుడు విజేందర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా వెంకట్‌రెడ్డి కుటుంబ సభ్యులను ఆదివారం మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస్ రెడ్డి, పలువురు బీఆర్ఎస్ నేతలు పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

చింతపల్లి, జూలై 28: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం వింజమూర్ గ్రామపంచాయతీలోని ధైర్యపురి తండాకు చెందిన రమావత్ కేశవులు(60) దుకాణానికి వెళ్లి రోడ్డు దాటుతుండగా మల్లేపల్లి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో కేశవులు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయంపై చింతపల్లి ఎస్‌ఐ యాదయ్యను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

గోశాలకు గోవుల తరలింపు

చండూరు రూరల్, జూలై 28: నల్లగొండ జిల్లా చండూరు మండలం బంగారిగడ్డ గ్రామంలో యుగతులసి ఆధ్వర్యంలో 2022 సంవత్సరంలో ఏర్పాటు చేసిన గోశాలను గోపాలకుల కొరత, నిర్వహణ పరమైన సమస్యలు తలెత్తడంతో మూసివేశారు. ఇందులో ఉన్న 170 గోవులను ఆదివారం హైదరాబాద్‌లోని యుగ తులసి గో మహా క్షేత్రానికి తరలించినట్లు యుగ తులసి చైర్మన్ కె. శివకుమార్ తెలిపారు.

చిలుకూరులో పెట్రోల్ దొంగలు

చిలుకూరు, జూలై 28: సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల కేంద్రంలో రోడ్డు సమీపంలో నిలిపిన వాహనాల్లోంచి పెట్రోల్‌ను దొంగతనం చేస్తున్న సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. బస్టాండ్ సెంటర్‌లోని మూడు ఇళ్లలోని ఎనిమిది బైక్‌లలో పెట్రోల్ దొంగతనం చేశారు. ఇంటి బయట పార్క్ చేసిన బైక్‌లలో పెట్రోల్ తీసి పెట్రోల్ దొంగతనం చేస్తున్నారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఆదివారం ఫిర్యాదు చేశారు.

మొబైల్ ఫోన్ అప్పగింత

నార్కట్‌పల్లి, జూలై 28: ఏమురుపాటున బస్టాండ్‌లో ఓ ప్రయాణికుడు తన మొబైల్ ఫోన్‌ను మరిచిపోగా నార్కట్‌పల్లి ఆర్టీసీ సిబ్బంది తిరిగి అతనికి అందజేశారు. వేములపల్లి మండలం మొల్కపట్నం గ్రామానికి చెందిన నాగేందర్ అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కలిసి నల్లగొండకు వెళ్లేందుకు నార్కట్‌పల్లి బస్టేషన్‌లో బస్సు రాక కోసం కూర్చున్నాడు. కాగా మొబైల్‌తో ఆడుకున్న తన పిల్లలు బస్సు రాగానే మొబైల్‌ను మరిచి బస్టాండ్‌లోని సీట్లలో వదిలేసి వెళ్లిపోయారు. కాగా బస్సు కోసం బస్టాండ్‌లో వేచిచూస్తున్న ఓ లెక్చరర్‌కు ఆ మొబైల్ కనపడటంతో డ్యూటీలో ఉన్న స్టేషన్ మేనేజర్ ఎంవీ.చారికి అందజేశాడు. ఇంతలోనే ఫోన్ మర్చిపోయిన బాధితులు ఫోన్ చేసి రావడంతో వారికి ఫోన్‌ను అప్పగించాడు.

రాష్ట్రస్థాయిలో రాణించాలి : రంగారావు


రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు

మిర్యాలగూడ టౌన్, జూలై 28: రాష్ట్రస్థాయిలో రాణించి ఉమ్మడి జిల్లాకు పేరు తేవాలని బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తోట రంగారావు అన్నారు. సూర్యాపేట, నల్లగొండ జిల్లా స్థాయి అండర్-13 సెలక్షన్స్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులను ఆదివారం అభినందించారు. జిల్లా కోచ్ మారబోయిన రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 8న రాష్ట్ర రాజధానిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎంబీఏ సభ్యులు డాక్టర్ ప్రశాంత్, సుశాంక్ తదితరులు పాల్గొన్నారు.

కొనలేం.. తినలేం

● పెరిగిన కూరగాయల ధరలు

చింతపల్లి, జూలై 28: చింతపల్లి మండలంలోని వెంకటేశ్వరగనర్‌కు చెందిన బొడ్డు ప్రభాకర్ ప్రైవేట్ ఉద్యోగి. నెలకు రూ.15వేల సంపాదనతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. కూరగాయలను కొనడానికి రూ.100 తీసుకొని మార్కెట్‌కు పోతే మూడు రకాలు కూడా రాకపోవడంతో దిక్కుతోచక లబోదిబోమంటున్నాడు. కొన్ని రోజులుగా అడ్డూ అదుపు లేకుండా పెరుగుతున్న కూరగాయల ధరలు సామాన్యులను బెంబేలెత్తిస్తున్నాయి. ఏ కూరగాయ కొనాలన్నా విలవిల్లాడుతున్నారు. చింతపల్లి మండలంలోని వేంకటేశ్వరనగర్(మాల్) మార్కెట్ యార్డులో దాదాపు అన్ని కూరగాయల ధరలు కిలో రూ.30నుంచి రూ.60 వరకు వెచ్చించాల్సి వస్తోంది. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా బోరు బావుల్లో పూర్తిస్థాయిలో నీరు లేకపోవడంతో పంట విస్తీర్ణం భారీగా తగ్గింది. ఫలితంగా కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయి. రోజువారీ సంపాదనలో సగం కూరగాయలకే ఖర్చు చేయాల్సి వస్తోందని సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.300తో కూరగాయలు విక్రయిస్తే వారం రోజులకు సరిపోవడం లేదని వాపోతున్నారు.

రైతులకు నష్టం

ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తున్న రైతులు సైతం మార్కెట్‌కు తెచ్చిన కూరగాయలు విక్రయించే పరిస్థితి లేదని ఆందోళన చెందుతున్నారు. రైతులు, వ్యాపారులకు విక్రయిస్తున్న ధరలకు వినియోగదారులకు అందుతున్న ధరలకు భారీగా వ్యత్యాసం ఉంటుందని, సరి చేయగలిగితే ధరల నియంత్రణ సాధ్యమవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



కూరగాయల ధరలు (కిలోకు)

బీరకాయ	రూ.50
వంకాయ	రూ.45
దొండకాయ	రూ.35
చిక్కుడు	రూ.70
చామగడ్డ	రూ.50
టమాటా	రూ.75
ఆలుగడ్డ	రూ.55
క్యారెట్	రూ.60
బెండకాయ	రూ.30
క్యాప్సికం	రూ.70
గోకరకాయ	రూ.60
ఉల్లిగడ్డ	రూ.60
క్యాలీఫ్లవర్	రూ.65
క్యాబేజీ	రూ.65
పచ్చిమిర్చి	రూ.65

కొనలేకపోతున్నాం



నేను కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నా. ప్రస్తుతం కూరగాయల ధరలు విపరీతంగా ఉన్నాయి. రూ.200తో మార్కెట్‌కు వస్తే అన్ని రకాల కూరగాయలు కొనలేని పరిస్థితి. సంపాదనలో ఎక్కువభాగం కూరగాయలు కొనడానికి ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం ధరల నియంత్రణ చేయకపోవడంతో నిరు పేదలు జీవించడం కష్టంగా ఉంది.

బండమీది పాపమ్మ గృహిణి, ఎం.మల్లేపల్లి

నియంత్రణ కమిటీలు ఏం చేస్తున్నాయో



మాకు వెంకటేశ్వరనగర్(మాల్)లో హోటల్ ఉంది. పెరిగిన ధరలతో హోటల్ నిర్వహణ కష్టంగా మారింది. ఉల్లి ఒక్కసారిగా రూ.60 నుంచి రూ.65 చేరింది. జిల్లాస్థాయిలో ధరల నియంత్రణ కమిటీలు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం స్పందించి నియంత్రణ కమిటీలు ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకోవాలి.

గులకుంట తిరుపతయ్యగౌడ్, హోటల్ యజమాని, వీటి నగర్

మోటర్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తొలగింపు పూర్తి

● సాగర్ జలాశయానికి 53,774 వేల క్యూసెక్కులకు పెరిగిన వరద ● సాగర్ నీటిమట్టం 510.20 అడుగులు



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగిస్తున్న సిబ్బంది

పెద్దఅడిశర్లపల్లి, జూలై 28: వేసవిలో హైదరాబాద్ జంట నగరాలకు, జిల్లా తాగు నీటి అవసరాలు తీర్చేందుకు హెచ్‌ఎండబ్ల్యూఎస్(జల మండలి) ఆధ్వర్యంలో నాగార్జునసాగర్ జలాశయంలోని ఏఎమ్మార్పీ ప్రాజెక్టు పరిధిలోని పుట్టంగండి జీరో పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన ఎమర్జెన్సీ మోటర్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పూర్తిగా అధికారులు ఆదివారం తొలగించారు. శ్రీశైలం ప్రాజెక్టు విద్యుత్ ఉత్పత్తి ద్వారా ఆదివారం సాయంత్రం 53,774 క్యూసెక్కుల నీరు రావడంతో నీటినిల్వ 510.20 అడుగులకు చేరింది. నాగార్జునసాగర్ జలాశయం డెడ్‌స్టోరేజీ 510 అడుగుల దిగువకు చేరడంతో హైదరాబాద్ జంటనగరాలకు, నల్లగొండ జిల్లావాసులకు తాగునీరు అందించేందుకు కృష్ణా జలాల సరఫరాకు హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ అధికారులు గత ఏప్రిల్ 17వ తేదీన పుట్టంగండి వద్ద కృష్ణానదిలో జీరో పాయింట్ వద్ద 10 మోటర్లను ఏర్పాటు చేసి 900 క్యూసెక్కుల నీటిని పుట్టంగండికి సరఫరా చేసి అక్కడి నుంచి రెండు పంపులతో 800 క్యూసెక్కుల నీటిని ఏకేబీఆర్‌కు తరలించారు. సాగర్‌లో 503 అడుగుల నుంచి సైతం నీటిని తీసుకున్నారు. ఏకేబీఆర్ నుంచి 525 క్యూసెక్కుల నీటిని జంటనగరాలకు, 45 క్యూసెక్కుల నీటిని జిల్లాలోని మిషన్ భగీరథ ట్యాంకులకు సరఫరాచేసి వేసవిలో నీటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఇటీవల కృష్ణానది వరదలతో నాగార్జునసాగర్ జలాశయం రోజురోజుకు నీటిమట్టం పెరుగుతుండడంతో గత రెండు రోజులుగా మోటర్లు, ప్లాట్‌ఫాం, ట్రాన్స్‌ఫార్మర్‌ను పూర్తిగా తొలగించినట్లు జలమండలి డీజీఎం వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. తొలగించిన మోటర్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, ఇతర సామగ్రిని కోదండపురం, నసర్లపల్లి, గొడగోండ్ల ప్లాంట్‌లో భద్రపరుచుతామని ఆయన తెలిపారు.

వానొస్తే కురవాల్సిందే..


డార్మెటరీ హాల్ పిల్లర్లకు ఏర్పడిన పగుళ్లు, పగుళ్ల నుంచి చేరిన వర్షపు నీరు

● నాణ్యత లోపించిన నిర్మాణాలు

నార్కట్‌పల్లి, జూలై 28: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని శైవక్షేత్రం చెర్వుగట్టు పార్వతీజడల రామలింగేశ్వరస్వామి దేవస్థానం గుట్టపై చేపట్టిన డార్మెటరీ హాలు గోడలు, పిల్లర్లు (అడ్డ బీములు) జాయింట్ల వద్ద పగుళ్లు ఏర్పడ్డాయి. పగుళ్ల నుంచి వర్షపు నీరుకారి హాల్‌లోకి వస్తుండటంతో భక్తులు కూర్చోవడానికి అసౌకర్యంగా మారింది. నాణ్యతా లోపంతో నిర్మాణం వల్లే పగుళ్లు వచ్చాయని భక్తులు ఎత్తి చూపిస్తున్నా దేవదాయ శాఖ ఇంజనీరింగ్ అధికారులు మాత్రం దీన్ని తేలిగ్గా తీసుకుంటున్నారు. చెర్వుగట్టు దేవస్థానంలో అభివృద్ధి పనుల్లో భాగంగా సుమారు రూ.3 కోట్లతో నిర్మిస్తున్న కల్యాణ మండప విస్తరణ, సాలహారంతో కూడిన డార్మెటరీ హాల్ నిర్మాణ పనులకు గత ప్రభుత్వ హయాంలో 2022 ఫిబ్రవరి 6న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఇప్పటివరకు దాదాపు 80 శాతం నిర్మాణం పూర్తి కావచ్చింది. అయితే డార్మెటరీ హాలులో ఉన్న స్లాబ్ జాయింట్ పిల్లర్లు, గోడలకు పలు చోట్ల పగుళ్లు ఏర్పడ్డాయి. వారం రోజులుగా కురిసిన వర్షాలతో పగుళ్ల నుంచి వర్షపు నీరు హాలులోకి చేరి నిల్వ ఉంటోంది. దీంతో భక్తులకు అసౌకర్యంగా మారింది. నిర్మాణ పనుల్లో నాణ్యతా లోపాలవల్లే ఇలా జరిగిందని భక్తులు విమర్శిస్తున్నారు.

ఇది సహజమే

స్లాబ్ విస్తరణ పనులు చేపట్టినపుడు పిల్లర్ జాయింట్ల వద్ద పగుళ్లు రావడం సహజమే. పనులు ఇప్పటికి కేవలం 80శాతమే పూర్తయ్యాయి. ఇంకా కల్యాణ మండపం చుట్టూ బండలు వేయాల్సి ఉంది. ఇంకా చిన్నచిన్న పనులు చేయాల్సి ఉంది. దేవదాయశాఖ ఇంజనీరింగ్ విభాగం సాంకేతిక నిపుణుడి సూచనలతో పగుళ్లను మూసేస్తాం.

కిరణ్, దేవస్థానం ఏఈ

ఉచితంగా ఇవ్వాల్సిందే..

● చిరువ్యాపారుల నుంచి పోలీసుల బలవంతపు వసూళ్లు ● స్టేషన్‌లో వంట కోసం దందా



నేరేడుచర్ల, జూలై 28: పట్టణంలో పోలీసుల వసూళ్లపై చిరు వ్యాపారుల్లో ఆందోళన నెలకొంది. ఫుట్‌పాత్‌పై కూరగాయలు, పండ్లు, బజ్జీలు, జిలేబీ, ఉల్లిపాయలు పాలు, పెరుగు విక్రయించుకునే చిరు వ్యాపారులను పోలీసులు బెదిరిస్తూ ఆయా వస్తువులను దౌర్జన్యంగా తీసుకువెళుతున్నారు. చిరువ్యాపారులు పోలీసులకు భయపడి అడిగినవి సమర్పించుకుంటూ మౌనంగా వేదనను భరిస్తున్నారు. కూరగాయలు విక్రయించుకుని జీవించే ఓ మహిళ పోలీసులను ఆదివారం నిలదీయగా ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది.

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...

ప్రతి రోజు కొందరు పోలీసులు సంచులు తీసుకుని పట్టణంలో కూరగాయలు, పండ్ల దుకాణాలు, బజ్జీలు, బోండాలు, జిలేజీలు విక్రయించే చిరు వ్యాపారుల వద్దకు వస్తున్నారు. తాజా కూరగాయలు, పండ్లు, బజ్జీలు, పునుగులు వంటి ఆహార పదార్థాలను దౌర్జన్యంగా తీసుకువెళుతున్నారు. ఇష్టారీతిన ఎలాంటి డబ్బులు ఇవ్వకుండా పోలీసులు తీసుకువెళుతున్నందున ఎవరికి చెప్పుకోలేక చిరు వ్యాపారులు నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రతిరోజూ పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందికి వంట చేస్తున్నారని, కూరగాయాలు ఉచితంగా ఇవ్వాల్సిందేనంటూ పోలీసులు బలవంతంగా తీసుకువెళుతున్నారని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎదురు ప్రశ్నిస్తే 'మీ ఆధార్ కార్డులు మావద్ద ఉన్నాయి. అని పోలీసులు హెచ్చరిస్తూ జరిమానాలు విధిస్తున్నారని, చేసేదేమీలేక మిన్నకుండి చూస్తున్నామని వ్యాపారులు చెబుతున్నారు.

ఆదివారం హుజూర్‌నగర్ రోడ్డులోని ఓ కూరగాయల దుకాణంలో గతంలో ఓ పోలీసు వచ్చి మూడుసార్లు ఉచితంగా కూరగాయలు తీసుకువెళ్లాడు. కూరగాయల కోసం ఆదివారం మళ్లీ వచ్చాడు. ఆ సమయంలో దుకాణంలో ఇద్దరు దంపతులు ఉన్నారు. సంచిలో ఆ పోలీసులు కూరగాయలు వేసుకోగా, డబ్బులు ఇవ్వమని మహిళ అడిగింది. ఇవి పోలీస్‌స్టేన్‌కు అని ఆ పోలీసు చెప్పగా, 'పోదాం పద నేను కూడా స్టేషన్‌కు వస్తా'అని ఆ మహిళ అనడంతో పాటు 'ఎన్నిసార్లు ఉచితంగా తీసుకువెళతారు..మేము రోడ్డు మీద బతుకుతుంటే బెదిరించి ఇలా తీసుకుకెళాతారా?' అంటూ సదరు మహిళ గొడవ చేస్తూ సంచిని గుంజుకుంది. చుట్టుపక్కల ప్రజలు చూస్తుండడంతోచేసేదేమీ లేక సదరు పోలీసు ఆ మహిళకు రూ.100 ఇచ్చి, మిగిలిన డబ్బులు అడుగుతుండగా అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

మాకు ఉచితంగా ఇవ్వాలంటూ పోలీసులు బెదిరించి తీసుకువెళుతున్నారని పలువురు దుకాణదారులు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ప్రతి రోజు పోలీస్‌స్టేషన్‌కు హోటల్ నుంచి భోజనాలు తెచ్చుకుంటే డబ్బులు ఎక్కువ అవుతున్నాయని పోలీసులు ఈ దందా మొదలుపెట్టారని స్థానికులు చెబుతున్నారు. వంటకు కావాల్సిన గ్యాస్, బియ్యం, నూనె, పప్పులు కూడా ఉచితంగానే పోలీసులకు వస్తున్నాయంటూ కొందరు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

ఈ రోజే నాకు తెలిసింది

చిరు వ్యాపారుల నుంచి కూరగాయలు, పలు వస్తువులు ఉచితంగా కొందరు సిబ్బంది తీసుకువెళుతున్నట్లు నాకు ఈ రోజే తెలిసింది. ముగ్గురు హోంగార్డులు వసూళ్లకు పాల్పడుతున్నారని సమాచారం ఉంది. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లా.

-రవీంద్రనాయక్, ఎస్ఐ

'ధరణి' కాసుల గని

● డబ్బు ముట్టచెబితేనే దరఖాస్తులు కదిలేది.. రిజిస్ట్రేషన్లు అయ్యేది
● రైతును డబ్బు డిమాండ్ చేసిన కంప్యూటర్ ఆపరేటర్ తొలగింపు

కోదాడ రూరల్, జూలై 28: భూసమస్యల పరిష్కారం కోసం ప్రజలు 'ధరణి' వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకున్నా పరిష్కారానికి సంవత్సరాల సమయం పడుతోంది. రోజుకో కొత్త నిబంధనలతో ఒకే దరఖాస్తు తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయానికి, అక్కడి నుంచి కలెక్టరేట్‌కు ఇలా రెండు, మూడు పర్యాయాలు కూడా తిరుగుతోంది. ఈ దరఖాస్తుల పరిష్కారానికి కొందరు 'ధరణి' ఆపరేటర్లు రైతుల నుంచి లంచాలు వసూలు వసూలు చేస్తున్నారు. అయినా సమస్య పరిష్కారం కాక రైతులు రెవెన్యూ కార్యాలయాలు, కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో దరఖాస్తులతో పాటు, కొత్తగా ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన డిజిటల్ సిగ్నేచర్లు తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్నాయని కొందరు రైతులు కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌డేలో ఫిర్యాదు చేస్తున్నారు. ఆయా కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉంటే కలెక్టరేట్‌కు ఎందుకు వచ్చారంటూ అధికారులు వ్యాఖ్యానించడంతో ఆశ్చర్యపోవడం రైతుల వంతువుతోంది. అదే విధంగా వ్యవసాయభూముల రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో కూడు రైతులు లంచాలు సమర్పించుకోవాల్సి వస్తోంది.

అంతా ఆపరేటర్ కనుసన్నల్లోనే..

వ్యవసాయ భూముల క్రయ, విక్రయాలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ చేస్తూ గత ప్రభుత్వం ధరణి వెబ్‌సైట్‌ను తీసుకొచ్చింది. దీనిలో ప్రతి రైతుకు సంబంధించిన భూమి వివరాలు, ప్రభుత్వ భూములు, దేవాలయాల భూములు, వ్యవసాయేతర భూములు నమోదు చేయాలని గత ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అప్పటినుంచి వ్యవసాయ భూముల క్రయ, విక్రయాల రిజిస్ట్రేషన్లు తహసీల్దార్ కార్యాలయంలోనే జరుగుతున్నాయి. రిజిస్ట్రేషన్ కోసం మీసేవలో స్లాట్ బుక్ చేయించుకుని ఆ భూమికి మార్కెట్ ధర ప్రకారం చలానా చెల్లించాలి. ఆ తర్వాత రిజిస్ట్రేషన్ చేస్తారు. కోదాడ తహసీల్దార్ కార్యాలయంలో భూమి క్రయ, విక్రయాలకు ముందుగా ధరణి కంప్యూటర్ ఆపరేటర్‌ను సంప్రదించాలి. ఆయన బుక్ చేసుకోమంటేనే స్లాట్ బుక్ చేసుకోవాలని రైతులు ఆరోపిస్తున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కావాలంటే ఎకరాకు రూ.2వేల నుంచి రూ.5వేల వరకు ధరణి ఆపరేటర్ చేస్తున్నాడని, భూములకు సంబంధించి ఏమైనా లోపాలు ఉంటే రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు డిమాండ్ చేస్తున్నారని రైతులు తెలిపారు.

మండలంలోని కాపుగల్లు గ్రామానికి చెందిన వీరపనేని కొండలురావుకు 10ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి ఉంది. దీనిని కుటుంబ సభ్యులకు పంపిణీ చేసేందుకు స్లాట్ బుక్ చేసుకోవడానికి మీసేవ ఆపరేటర్‌ను వారం రోజుల క్రితం కలిసాడు. ధరణి ఆపరేటర్ వెంకయ్య చెప్తేనే తాను స్లాట్ బుక్ చేసుకుంటానని మీసేవ ఆపరేటర్ తెలిపాడు. దీంతో కొండయ్య కుమారుడు సోమసుందర్, ధరణి కంప్యూటర్ ఆపరేటర్ వెంకయ్యను కలిసాడు. సంబంధిత పత్రాలను, పట్టాదారు పుస్తకాన్ని వెంకయ్య పరిశీలించి మార్కెట్ ధర ప్రకారం భాగ పంపిణీకి రిజిస్ట్రేషన్ చేస్తే రూ.2లక్షలు ఖర్చవుతుందని. తనకు రూ. 50 వేలు ఇస్తే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేస్తానన్నాడు. రూ.30వేలకు రైతు ఒప్పందం చేసుకున్నారు. వారం రోజుల క్రితం రిజిస్ట్రేషన్ పూర్తయింది. ఒప్పందం ప్రకారం రూ.30వేలు ఇవ్వాలని కంప్యూటర్ ఆపరేటర్ వెంకయ్య, సోమసుందర్‌ను అగిగాడు.. పక్కనే ఉన్న తండ్రి కొండయ్య వారసత్వంగా వచ్చిన భూమికి నీకు రూ.30వేలు ఎందుకు ఇవ్వాలి? మేము ఇచ్చేదిలేదని వెళ్లిపోయాడు. మూడు రోజుల క్రితం సోమసుందర్‌కు కంప్యూటర్ ఆపరేటర్ వెంకయ్య ఫోన్ చేసి రూ.30వేలు ఇచ్చి రిజిస్ట్రేషన్ పత్రాలు తీసుకువెళ్లాలని, లేనట్లయితే రిజిస్ట్రేషన్ క్యాన్సిల్ చేస్తామని బెదిరించాడు. ఈ రూ.30 వేలలో ఉన్నతాధికారులకు కూడా ఇవ్వాల్సి ఉందని, మీరు ఇవ్వకుంటే నేనే ఇవ్వాల్సి ఉంటుందని వెంకయ్య తెలిపి, డబ్బును డిమాండ్‌చేశారు. వెంకయ్య వాయిస్‌ను సోమసుందర్ రికార్డు చేసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో పాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణ చేసి 24గంటల్లో నివేదిక అందజేయాలని ఆర్డీవోను కలెక్టర్ తేజనందాలాల్ ఆదేశించారు.



కోదాడ తహసీల్దార్ కార్యాలయం

ఇటీవలే నడిగూడెం నుంచి కోదాడకు ..

కోదాడ తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లలో అవకతవకలు జరుగుతున్నాయని గతంలో కూడా ఫిర్యాదు రావడంతో సంబంధిత ధరణి కంప్యూటర్ ఆపరేటర్‌ను నడిగూడెం మండలానికి బదిలీ చేశారు. ఇటీవల ఆయన తిరిగి నడిగూడెం నుంచి కోదాడకు వచ్చాడు.

'ధరణి' కంప్యూటర్ ఆపరేటర్ తొలగింపు

కోదాడ తహసీల్దార్ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ సిబ్బందిగా పనిచేస్తున్న ధరణి ఆపరేటర్ కె.వెంకయ్యను ఉద్యోగంలో నుంచి తొలగించినట్లు అదనపు కలెక్టర్ డీఎస్ లత ఒక ప్రకటనలో తెలిపారు. లంచం కోసం రైతు వీరపనేని కొండలరావు కుటుంబాన్ని వేధించినందుకు ఆర్డీవో సూర్యానారాయణతో విచారణ చేయించి నివేదిక ప్రకారం విధుల నుంచి తొలగించామన్నారు.

ముత్యాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

హుజూర్‌నగర్, జూలై 28: ఆషాఢమాసం సందర్భగా పట్టణంలోని ముత్యాలమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీశైవక్షేత్ర వనితశక్తి ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ముత్యాలమ్మతల్లికి బోనాలు, చీరె, సారెలతో ఒడిబియ్యం సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజల్లో శైవక్షేత్ర సంఘం అధ్యక్షురాలు త్రిపురమళ్ల నాగలక్ష్మి, తమ్మన సుజాత, ఉప్పల పద్మ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా సౌర హోమం

అర్వపల్లి, జూలై 28: జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం సమీపంలోని అఖండ జ్యోతి స్వరూప సూర్యనారాయణ క్షేత్రంలో ఆదివారం మహా సౌరహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సౌర అరాధకుడు జనార్దన్‌స్వామి, అర్చకులు రామశర్మ, వేణుగోపాలశర్మ, పెద్ద సంఖ్యలో భక్తులే పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వాలు సహకరించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్-టీఎస్ నాయకులు

సూర్యాపేట టౌన్, జూలై 28: ఎస్సీ వర్గీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలని ఎమ్మార్పీఎస్-టీఎస్ జిల్లా అధ్యక్షుడు బచ్చలకూరి నాగరాజుమాదిగ అన్నారు. ఢిల్లీని జంతర్‌మంతర్ వద్ద ఆగస్టు ఆరో తేదీన నిర్వహించే 'చలో ఢిల్లీ' కరపత్రాలను ఆదివారం జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్ రోడ్డులో ఆవిష్కరించి మాట్లాడారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బొజ్జ పరశురాం, శ్రీనివాస్, పిడమర్తి సంపత్, శ్రీకాంత్, శివ, ప్రేమ్‌కుమార్, రాజుత, గణేష్, సన్నీ, కనుకు ప్రవీణ్, చాగంటి మురారి, రోహిత్, వెంకటరమణ, మంజు, దుర్గాప్రసాద్, మహేష్, సందీప్ పాల్గొన్నారు

హోంగార్డు జానీ కుటుంబాన్ని ఆదుకుంటాం

హుజూర్‌నగర్ రూరల్, జూలై 28: మండలంలోని లింగగిరి గ్రామంలో డెంగీ జ్వరంతో మృతి చెందిన హోంగార్డు జానీ కుటుంబాన్ని ఆదుకుంటామని సీఐ చరమందరాజు, పోలీస్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బెల్లంకొండ రామచందర్ గౌడ్ అన్నారు. ఆదివారం జానీ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఆదేశాల మేరకు జానీ కుటుంబానికి రూ.15వేల ఆర్థిక సాయాన్ని సీఐ అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు ముత్తయ్య, రామాంజనేయులు, అశోక్, రవి, రాము తదితరులు పాల్గొన్నారు.

'బలహీన వర్గాలకు పదవులు కేటాయించాలి'

సూర్యాపేట టౌన్, జూలై 28: అన్ని రాజకీయ పార్టీలు బలహీనవర్గాలకు రాష్ట్ర అధ్యక్ష పదవులను కేటాయించాలని సామాజిక న్యాయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తలమల్ల హుస్సేన్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సిద్దార్థ పాఠశాలలో రాజకీయ పార్టీలలో-సామాజిక న్యాయం అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో తప్పెట్ల శ్రీరాములు భద్రయ్య, రేపాక లింగయ్య, నాగేందర్‌నాయక్, దాసరి శ్రీనివాస్, చలమళ్ల నర్సిహా, నట్టు నాగయ్య, అంజమ్మ, అన్నెపర్తి పద్మ, కంచుకొమ్ముల వెంకట్‌పాల్గొన్నారు.

తొమ్మిది మంది జూదరుల అరెస్టు

● రూ.58 వేలు, ఆరు సెల్‌ఫోన్లు, ఐదు బైక్‌లు సీజ్

చిలుకూరు, జూలై 28: మండలంలోని బేతవోలు గ్రామంలో పేకాట ఆడుతున్న తొమ్మిది మంది పేకాటరాయుళ్లను పోలీసులు ఆదివారం ఆరెస్టు చేశారు. ఎస్ఐ సురభి రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బేతవోలుకు చెందిన జిల్లా ప్రసాద్ ఇంట్లో పేకాడ ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసి, నిందితుల నుంచి రూ.58వేలు, ఆరు సెల్‌ఫోన్లు, ఐదు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

హుజూర్‌నగర్, జూలై 28: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని పీఆర్‌టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు నరేష్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి బోళ్ళ కవిత కోరారు. ఆదివారం పట్టణంలో పీఆర్‌టీయూ యూనియన్ సభ్యత్వ నమోదును ప్రారంభించి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే మంజూరు చేయాలని, స్కావెంజర్లను వెంటనే భర్తీ చేయాలన్నారు. జీవో నెం.317ను రద్దు చేసి, భార్యభర్తలైన ఉద్యోగులను ఒకేచోట ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేసి విద్యా వ్యవస్థను కాపాడుకోవాల్నారు. ఈ కార్యక్రమంలో పి.శ్రీను, శ్రీనివాసరెడ్డి, లతీఫ్, జయవాణి, ప్రభాకర్‌రావు, వెంకటరెడ్డి, మధురెడ్డి, బాబు, శ్రీను, వేణు, మీరావలి, బ్రహ్మారెడ్డి, సత్యనారాయణ, తాతరాజు శ్రీనివాసు, వెంకటయ్య, బేబీరాణి, జయమ్మ, జనార్దన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సీత, రజిత, రేణుక, మైసయ్య, రాంబాబు, అశోక్, శాంత తదితరులు పాల్గొన్నారు.

30 శాతం నిధులు కేటాయించాలి

విద్యారంగానికి ప్రభుత్వం 30 శాతం నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి చందర్‌రావు కోరారు. ం పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. విద్యా రంగానికి 7.3 శాతం నిధులు మాత్రమే కేటాయించడం శోచనీయమన్నారు. కపిల్ సిబాల్ నివేదిక ప్రకారం 30శాతం నిధులు కేటాయిస్తేనే న్యాయం జరుగుతుందన్నారు. జాబ్ క్యాలెండర్‌ను వెంనటే విడుదల చేయాలన్నారు. ఈనెల 31న పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఛలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కామాల ఉదయ్, ప్రవీణ్, భాను, మధు, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధులు గోల్‌మాల్

● రెండు నెలల్లో రూ.10.37లక్షలు డ్రా
● పనులు చేయండా నిధులు డ్రా చేశారని ఆరోపణ

సూర్యాపేట, జూలై 28: ఆత్మకూర్(ఎస్) మండలంలోని నెమ్మికల్ గ్రామంలో ఎలాంటి పనులు చేయకుండా రెండు నెలల్లో రూ.10.37 లక్షలు పంచాయతీ కార్యదర్శికి సంబంధం లేని వ్యక్తుల పేరిట డ్రా చేశారని ఆ గ్రామస్థులు తెలిపారు. ఈ విషయం రెండో రోజులు సోషల్ మీడియా లో ట్రోల్ కూడా అవుతోంది. గ్రామంలో రెండు నెలల క్రితం ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టిన పంచాయతీ కార్యదర్శి గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని, అయినా మొత్తం రూ.10.37లక్షలను కొందరి పేరిట డ్రా చేశారని, దీంతోపాటు మరికొన్ని పనులు చేసినట్లు డబ్బులు డ్రా చేశారని తెలిపారు. గ్రామంలో ట్రాక్టర్ల టైర్ల కొనుగోలు మినహా, గ్రామంలో ఎలాంటి అభివృద్ధికి డబ్బు ఖర్చు చేయలేదన్నారు. . గ్రామ పంచాయతీలో సర్పంచులు, వార్డు మెంబర్ల పదవీకాలం పూర్తికాగానే ప్రత్యేక బాధ్యతలు చేపట్టిన పంచాయతీ కార్యదర్శులు, అధికారులు ఇష్టానుసారంగా గ్రామ పంచాయతీల అభివృద్ధి నిధులను దుర్వినియోగం చేస్తున్నారని, ఈ నిధుల దుర్వినియోగంపై కలెక్టర్ విచారణ చేయించాలని గ్రామస్థులు కోరారు.

పనులు చేశాను, బిల్లులు ఉన్నాయి

నెమ్మికల్ గ్రామంలో అభివృద్ధి పనులు చేశాం. ప్రతి పనికి బిల్లులు ఉన్నాయి. గతంలో చేసిన కొన్ని పనులకు, ఇటీవల చేసిన పనులకు సంబంధించిన రికార్డులతో పాటుగా బిల్లులు ఉన్నాయి. వాటి ఆధారంగానే డబ్బులు డ్రా చేశాం. గ్రామంలో కొంతమంది రాజకీయ విభేదాలకు అధికారుల విధులకు ఆటంకం కలిగిస్తున్నారు.

●సుధాకర్, పంచాయతీ కార్యదర్శి, నెమ్మికల్ గ్రామం

డొంక దారిలో రాళ్లతో అవస్థలు

మఠంపల్లి: మండలంలోని రఘునాథపాలెం గ్రామం నుంచి పొలాలకు వెళ్లే డొంకదారి రాళ్లతో నిండి ఉండ టంతో రాకపోకలు సాగించడానికి రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. నాలుగు కిలోమీటర్ల మేర ఉన్న ఈ డొంక దారిని ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. వ్యవసాయ పనులకు నడిచివెళ్లాలన్నా, ద్విచక్ర వాహనాలపై వెళ్లాలన్నా అవస్థలు పడుతున్నామని, రాళ్లతో పశువుల, జీవాల కాలి గిట్టలకు దెబ్బలు తగిలి నడవలేకపోతున్నాయని రైతులు తెలిపారు. ఎడ్ల బండ్లపై పొలాలకు వెళ్లాలంటే తీవ్ర ఆటంకంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఉపాధిహామీ ఏపీవో ఉమను వివరణ కోరగాప్రతిపాదనలు తయారు చేయించి మరమ్మతు చేయిస్తామన్నారు.



రఘునాథపాలెం గ్రామం నుంచి పొలాలకు వెళ్లే డొంకదారి

గేట్లు తొలగించారు.. మరిచారు

భానుపురి: పట్టణంలోని విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ సమయంలో జిల్లా కేంద్రంలోని పశు సంవర్ధక కార్యాలయం గేట్లను తొలగించారు. ఆ గేట్లను తిరిగి అమర్చనందున కార్యాలయం అస్తవ్యస్తంగా మారింది.సబ్‌స్టేషన్ నిర్మించిన కాంట్రాక్టర్ రేపు..మాపంటూ గేట్లను అమర్చకుండా కాలయాపన చేస్తున్నాడని అధికారులు తెలిపారు.



సూర్యాపేటలోని పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో ఉన్న గేట్లు

'భూఆక్రమణలపై సీబీఐతో విచారణ చేయించాలి'

మఠంపల్లి, జూలై 28: మండలంలోని పెదవీడు రెవెన్యూ పరిధిలోని సర్వే.540లో జరిగిన భూఆక్రమణలపై సీబీఐతో విచారణ చేయించాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఐడీసీ రాష్ట్ర మాజీ డైరెక్టర్ సాముల శివారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మఠంపల్లిలో రైతులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రమంతా భూకబ్జాలు యథేచ్ఛగా జరుగుతున్నాయని, వీటిని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. పలువురు రైతులు మాట్లాడుతూ అప్పటి ఎమ్మెల్యే, అధికార పార్టీల నేతలు ప్రైవేటు కంపెనీలతో కుమ్మక్కై గిరిజన భూములను దౌర్జన్యంగా లాక్కున్నారని, అధికారులను పావులుగా వాడుకొని వందల ఎకరాల భూములకు పట్టాలు సృష్టించారని ఆరోపించారు. తమకు న్యాయం చేయా లని కోరారు. ఈ సమావేశంలో రైతులు లచ్చు, మునియా, చంద్రునాయక్, జగన్, వశ్యానాయక్, రమేష్, హరియా తదితరులు పాల్గొన్నారు.

నేడు సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు సెలవు

సూర్యాపేట సిటీ, జూలై 18: బోనాల పండుగ సందర్భంగా సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు మార్కెట్ కార్యదర్శి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలవు రోజున మార్కెట్‌కు రైతులు ఎలాంటి వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకురావద్దని ఆయన రైతులకు సూచించారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే ఆర్థికసాయం

అర్వపల్లి, నాగారం, జూలై 28: జాజిరెడ్డిగూడెం మండలం కొమ్మాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త మండి ఎల్లమ్మ, గడ్డం ఎల్లమ్మ కోడూరు గ్రామానికి చెందిన చెంచల అనసూర్య సూర్యానారాయక్ తండాకు చెందిన బాణోత్ భాగ్య చిత్రపటాలను ఎమ్మెల్యే సామేలు నివాళులర్పించి, ఒక్కో కుటుంబానికి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా నాగారం మండలంలో మూడు కుటుంబాను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఎమ్మెల్యే వెంట తొడుసు లింగయ్య, ఆకుల బుచ్చిబాబు, పానుగంటి నర్సింహారెడ్డి, కన్నెబోయిన వెంకటబిక్షం, బయ్యం వెంకన్న, పంది శ్రీనివాస్, మంగదుడ్ల దశరథ తదితరులు ఉన్నారు.

అక్రమంగా చెట్లు నరికివేత

కోదాడ రూరల్, జూలై 28: మండలంలోని తమ్మర గ్రామం లోని ఆర్డీవో కార్యాలయం పక్కన కోదాడ రహదారి వెంట ఉన్న చెట్లను కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు నరికివేశారు. సుమారు 20కి పైగా చెట్లను నరికివేశారని, వారిని పోలీసులు గుర్తించి, చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్థులు కోరారు.

'కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం'

గరిడేపల్లి, జూలై 28: కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి త్రిపురం సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం కోదాడలో జరిగే ఏ ఐటీయూసీ జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బెజ్జం రమేష్, ఎడవెల్లి వెంకటేశ్వర్లు, షేక్ పెద్దమస్తాన్, బాజోజ్ అప్పాచారి, ఆనందరావు, కీసరి నాగయ్య, పిట్ట రవి, నకిరేకంటి రవి, చింతలపాటి శ్రీను, వీరయ్య, తిరపయ్య పాల్గొన్నారు.

వీధి లైట్లు వెలగక ఇబ్బందులు

కోదాడ రూరల్, జూలై 28: మండలంలోని తమ్మర 3వ వార్డులో వీధిలైట్లు వెలగక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు తెలిపారు. సాయిబాబా దేవాలయం వీధిలో లైట్లు వారం రోజులుగా వెలగనందున భక్తులు రాత్రివేళల్లో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. దేవాలయం ఆవరణలో కాలిపోయిన వీధిలైట్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరారు.



సూర్యాపేట అర్బన్: పట్టణానికి చెందిన వస్త్ర వ్యాపారి గండూరి ప్రభాకర్ తన కుమారుడు మాన్విత్ పుట్టినరోజు సందర్భంగా జిల్లా కేంద్రంలోని అపూర్వ బదిరుల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కేక్‌ను కట్ చేసి, మిఠాయి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మదనాచారి పాల్గొన్నారు

చివ్వెంల: ఆర్ఎంపీ, పీఎంపీల నూతన మండల కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సొల్లేటి సత్యనారాయణ చారి, ప్రధాన కార్యదర్శిగా గుడిసె రామకృష్ణ, గౌరవ అధ్యక్షుడిగా మొగదాల నాగరాజు, ఉపాధ్యక్షుడిగా సైదులు, కోశాధికారిగా చింతల వేలాద్రి, ఆర్గనైజింగ్ కార్యదర్శింగా ఉపేందర్, ఈసీ మెంబర్లుగా అశోక్, ఎస్‌కే మైబెల్లి, శోభన్, శ్రీను, సతీష్, రమేష్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సత్యనారాయణ, భుజంగరావు పాల్గొన్నారు.

మఠంపల్లి, గరిడేపల్లి: మఠంపల్లి మండల కేంద్రంలో ఈనెల 30, 31వ తేదీల్లో జరిగే జిల్లా చైతన్య సదస్సును గిరిజన కుల సంఘాల నాయకులు, మేధావులు, యువకులు విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర నాయకులు భూక్య పాండునాయక్, జిల్లా అధ్యక్షుడు మాలోతు బాలునాయక్ కోరారు. ఆదివారం మఠంపల్లి, గరిడేపల్లి మండల కేంద్రాల్లో ఆ సంఘం నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనంతరం గరిడేపల్లి మండలం మంగాపురంతండాలో జిల్లా నాయకులతో కలిసి చైతన్య సదస్సు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బాలూనాయక్,షేక్ యాకుబ్ పాల్గొన్నారు.

మేళ్లచెర్వు: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 30వ తేదీన నిర్వహిచే 'చలో అసెంబ్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వట్టెపు సైదులు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన గ్రామపంచాయతీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్.వెంకన్న, పి.మల్లికార్జున్, వెంకటి మోష పాల్గొన్నారు.

కోదాడ టౌన్: హైదరాబాద్‌లోని కేబీఆర్ కన్వెన్షన్‌లో జరుగుతున్న ఫొటోటెక్ ఎగ్జిబిషన్‌కు ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఫొటోగ్రాఫర్లు తరలివెళ్లారు. తరలిన వారిలో సీనియర్ ఫొటో గ్రాఫర్లు, జెమినీ నరేష్, సప్తగిరి, లక్ష్మణ్, నరేష్ ఉన్నారు.

కోదాడ రూరల్, చిలుకూరు: నాగార్జునసాగర్ ఎడమ కాల్వ రైతులకు ప్రభుత్వం సాగునీటిని విడుదల చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లు ప్రసాద్, సీపీఐ మండల కార్యదర్శి బత్తినేని హనుమంతరావు డిమాండ్ చేశారు. మండలంలోని తమ్మర గ్రామంలో విలేకరులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో బత్తినేని హనుమంతరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

● నాగార్జున సాగర్ నీటిని విడుదల చేసి గ్రామాల్లోని చెరువులు, కుంటలు నింపాలని టీడీపీ సీనియర్ నాయకుడు కొల్లు నర్సయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు సాతులూరి గురవయ్య, కొండా సోమయ్య, కొల్లు సత్యనారాయణ పాల్గొన్నారు.

చిలుకూరు: ప్రభుత్వం సాగర్ నీటి విడుదలపై స్పష్టమైన తేదీలను ప్రకటించాలని రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డా వెంకటయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు

కోదాడ రూరల్: ఆర్ఐసీహెచ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సూర్యాపేట లయన్స్ కంటి ఆస్పత్రి సహకారంతో మండలంలోని రెడ్లకుంట గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని కోదాడ లారీ అసోసియేషన్ అధ్యక్షుడు కనగాల నాగేశ్వరరావు ప్రారంభించారు.

కోదాడ రూరల్: రీజినల్ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన కోదాడ ఆర్టీసీ డిపో ఉద్యోగులను ఆదివారం నల్లగొండలో ఈడీ పురుషోత్తం నాయక్ సన్మానించి, మాస పురస్కార అవార్డు అందజేశారు. ఉత్తమ బస్టాండ్‌గా కోదాడ బస్ స్టేషన్ అవార్డు అందుకోవడం పట్ల అభినందించారు. కార్యక్రమంలో ఎం.రాజశేఖర్, శ్రీహర్ష పాల్గొన్నారు.

నూతన్‌కల్: దివ్యాంగుల రిజర్వేషన్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ దివ్యాంగులకు క్షమాపణలు చెప్పాలని ఆ జిల్లా నాయకుడు బత్తుల శ్రీశైలంగౌడ్ కోరారు. మండలంలోని వెంకేపల్లి గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశంలో వెంకయ్య, నాగయ్య, రవి, శ్రీనివాస్, లింగయ్య పాల్గొన్నారు.

నడిగూడెం: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ పాఠశాలలో 50 మంది విద్యార్థులకు మాజీ వార్డు సభ్యుడు పి.శ్రీనివాస్ నోట్ పుస్తకాలు, పలకలు పంపిణీ చేశారు.

నడిగూడెం: రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో మైనార్టీలకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.3003కోట్లు మంజూరుచేయడం హర్షనీయమని కోదాడ నియోజకవర్గ మైనార్టీ నాయకుడు గులాం అహ్మద్ అన్నారు. గత ప్రభుత్వం రూ.2వేల కోట్లు మాత్రమే కేటాయించగా, కాంగ్రెస్ ప్రభుత్వం 36శాతం నిధులు పెంచడం అభినందనీయమన్నారు.

తిరుమలగిరి: పేదలకు ఉచితంగా విద్య, వైద్యం, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్న చంద్రశేఖర్ కోరారు. తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలో నిర్వహించిన సీపీఐ మండల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బెజవాడ వెంకటేశ్వర్లు, ఎల్లంల యాదగిరి, కంబాల శ్రీనివాస్, దేవర మల్లీశ్వరి, కోటమ్మ, ఫయాజ్, పాల్గొన్నారు.

తిరుమలగిరి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛ కార్మికులను నియమించి పాఠశాలల పరిశుభ్రతను కాపాడాలని తెలంగాణ పౌర స్పందన వేదిక నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మయ్య, దేవరాజు కోరారు. మండలంలోని గుండెపురి గ్రామంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బి.నర్సయ్య, యాదగిరిస్వామి, రాములు పాల్గొన్నారు.